క్లుప్తంగా

క్రీడాకారులకు సౌకర్యాలు కల్పించాలి



రొంపిచెర్ల: క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీవో రాజేంద్ర అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం ఆడుదాం ఆంధ్రా క్రీడలపై కార్యదర్శులు, పీఈటీలతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో మంగళవారం నుంచి క్రీడా పోటీలు జరుగనున్నాయని తెలిపారు. ఈ క్రమంలో క్రీడకారులకు అనుకూలంగా మైదానాలను ఏర్పాటు చేశామన్నారు. నీడ, తాగునీరు, అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బంది లేకుండా మందులు అందుబాటు ఉంచాలన్నారు. ఉదయం 7.30 నుంచి 12 గంటల వరకు పురుషులకు, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు మహిళలకు పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

సైకిల్ స్టాండ్ ప్రారంభం



సైకిల్ స్టాండ్‌ను ప్రారంభిస్తున్న రుద్రాణి, బాలసుబ్రమణ్యం

పుంగనూరు: పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో వాసవీ వనితా క్లబ్, పూర్వ విద్యార్థులు కలిసి సుమారు రూ.50 వేలు ఖర్చు చేసి సైకిల్ స్టాండ్‌ను నిర్మించినట్లు హెచ్‌ఎం రుద్రాణి తెలిపారు. ఆమె సోమవారం సైకిల్ స్టాండ్‌ను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ 1970–1975 సంవత్సరాలకు చెందిన విద్యార్థులు స్కూల్‌లో సైకిళ్లు పెట్టేందుకు రేకుల షెడ్డు నిర్మించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్లబ్, పూర్వ విద్యార్థులకు హెచ్‌ఎం కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు అపర్ణ, విశాలక్షి, సుజాత, ముత్యాలు, క్లబ్ ప్రతినిధులు వెంకటేష్, ప్రభాకర్, శివప్రసాద్, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

రేపు సదుంలో మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

సదుం: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం సదుం మండలంలో పర్యటిస్తారని జెడ్పీటీసీ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.


రేపు పడిమెట్ల పూజోత్సవం



సదుం: అయ్యప్పస్వామి ఆలయంలో పడిమెట్లు

సదుం: మండలంలో ఎర్రాతివారిపల్లె కోటమల్లై అయ్యప్పస్వామి ఆలయంలో ఈ నెల 27న పడిమెట్ల పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం నుంచి నిర్వహించే పూజోత్సవానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు చెప్పారు.

ఘనంగా సీతారాముల ఊరేగింపు



పులిచెర్ల(కల్లూరు): కల్లూరులో సోమవారం సీతారాముల ఊరేగింపును ఘనంగా చేపట్టారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ప్రతి గ్రామంలో ఇంటింటా అందజేసి జనవరి 22న అయోధ్యలో రాముల వారి ప్రాణ ప్రతిష్ఠ జరుగు సమయంలో పూజలు చేయాలని నిర్వాహకులు కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాదమునిరెడ్డి, మువ్వల నరసింహులుశెట్టి, గోవిందరెడ్డి, దేవేంద్రరెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

28న పలమనేరులో విద్యుత్ అదాలత్

గంగవరం: ఈ నెల 28వ తేదీన పలమనేరు సబ్ డివిజన్‌లో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసమూర్తి తెలిపారు. ఇందులో పలువురు విద్యుత్ అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. డివిజన్‌లోని పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లి, పెద్దపంజాణి, వికోట మండలాలకు సంబంధించిన విద్యుత్ వినియోగదారులు సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

పుంగనూరు చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న ఎంపీ రెడ్డెప్ప, పలమనేరు: సీఎస్ఐ చర్చిలో ఎమ్మెల్యే వెంకటేగౌడ, సోమల: కందూరు చర్చిలో చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఈశ్వరయ్య







ఏసు మార్గము అనుసరణీయం

పలమనేరు: ఏసు మార్గము అనుసరణీయమని పలువురు వక్తలు తెలిపారు. పలమనేరు మున్సిపాలిటీ, మండలంలో సోమవారం క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చిల వద్ద క్రిస్మస్ ట్రీలను ఏర్పాటు చేశారు. శాంటాక్లాజ్ వేషధారణతో వీధుల్లో తిరుగుతూ పిల్లలకు చాక్లెట్లు పంచి పెట్టారు. అన్ని చర్చిల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు క్రైస్తవ సంప్రదాయాలు, ఏసు మార్గాన్ని వివరించారు. పలమనేరులోని సీఐజీ చర్చి వద్ద ఏర్పాటు చేసిన భారీ నక్షత్రం, మంచులో శాంతాక్లాజ్, చుట్టూ తిరిగే క్రిస్మస్ ట్రీ, బంగారు ఆకుల వృక్షం తదితరాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి కొత్త సీఎస్ఐ పాత, కొత్త చర్చిలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలియజేశారు. నాయకులు మండీసుధా, మురళీకృష్ణ, కౌన్సిలర్లు శ్యామ్‌సుందర్‌రాజు, నాగరాజు,కోదండ రామయ్య, కిరణ్, రమేష్‌రెడ్డి, శ్యామ్, హేమంత్, సింగిల్‌విండో చైర్మన్ రఘునాథ్, ఆలయాల చైర్మెన్లు నరేష్, వీరభద్ర తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: మున్సిపాలిటీ, మండలంలో సోమవారం క్రిస్మస్ పండుగను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పుంగనూరు పట్టణంలోని సీఎస్ఐ చర్చి, మార్లపల్లెలోని డాన్‌బోస్కో చర్చితో పాటు పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇందులో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, ముస్లిం మైనారిటీ నాయకుడు ఇనాయతుల్లా షరీఫ్ పాల్గొన్నారు. వారిని ఫాదర్ రాఖేష్‌నిమ్రోద్ ఆశీర్వదించారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. క్రైస్తవులు తమ ఇళ్ల వద్ద వస్త్ర దానం, అన్నదానం చేశారు. రవికుమార్, సురేష్ క్రిష్టఫర్, హేమంత్, ఉదయ్‌కుమార్, భరత్‌భుషణ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మండలంలోని క్రైస్తవులు సోమవారం క్రిస్మస్ వేడుకలను కోలాహలంగా జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు దైవ సందేశాన్ని వినిపించారు. పొట్టగానిపల్లి చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎంపీపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగారెడ్డి పాల్గొన్నారు. రాజుపల్లి చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. పొట్టగానిపల్లి చర్చిలో సుబ్రమణ్యం అధ్వర్యంలో పేదలకు నిత్యావసర వస్తువులు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తులశమ్మ, రత్నమ్మ, రవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



రామకుప్పం: ప్రత్యేక అలంకరణలో బాల ఏసు

రామకుప్పంలో..

రామకుప్పం: మండల కేంద్రమైన రామకుప్పంలోని హోలీ ఫ్యామిలీ చర్చిలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫాదర్ చిన్నప్ప రాయలు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. 89–పెద్దూరు సర్పంచ్ మల్లిక ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో సిస్టర్ మేరీ, హోలీ ఫ్యామిలీ సందేశకులు, బీసీసీ మాజీ కో ఆర్డినేటర్ దయానందం పాల్గొన్నారు.

సోమలలో..

సోమల: కందూరులోని క్రీస్తు పరిమళ పరిచర్య ప్రార్థనా మందిరంలో పాస్టర్ జూస్ లూకాస్ ఆధ్వర్యంలో సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఎంపీపీ ఈశ్వరయ్య, సర్పంచ్ బాషా మసూద్ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు.

గంగవరంలో..

గంగవరం: మండలంలో సోమవారం క్రిస్మస్ పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రార్థనా మందిరాలను విద్యుత్ దీపాలు, క్రిస్మస్ ట్రీలతో విశేషంగా అలంకరించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె : మండలంలో సోమవారం క్రిస్మస్ వేడుకలను ఆనందోత్సహాల నడుమ ఘనంగా జరుపుకున్నారు. చర్చిలు, క్రీస్తు ప్రార్థన మందిరాల్లో ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. చిన్నారులకు కానుకలు అందజేశారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: మండలంలో క్రిస్మస్ పండుగను సోమవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. చర్చిలు, ప్రార్థన మందిరాలను ప్రత్యేకంగా అలంకరించారు. వారణాసివారిపల్లె, రామచంద్రాపురం కాలనీల్లోని ప్రార్థన మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.

పులిచెర్ల(కల్లూరు)లో..

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని క్రైస్తవులు సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కల్లూరు, పులిచెర్ల, కొమ్మిరెడ్డిగారిపల్లె చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కల్లూరులోని చర్చిలో పాస్టర్ ధనరాజ్ ఏసు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. అనంతరం అన్నదానం చేశారు.

గుడుపల్లెలో..

గుడుపల్లె: మండలంలోని పాగురుపల్లె, అగరం క్రాస్, చిన్నశెట్టిపల్లె, గుడుపల్లె తదితర గ్రామాల్లోని క్రైస్తవులు సోమవారం క్రిస్మస్‌ను ఘనంగా జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక పార్థనలు చేశారు. పాస్టర్లు ఏసు సందేశాన్ని వినిపించారు. అన్నదానం చేశారు.

కుప్పంలో..

కుప్పం రూరల్ : కుప్పం పట్టణంతో పాటు మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లోని క్రైస్తవులు సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మిఠాయిలు పంచి పెట్టారు. కుప్పంలోని జయప్రకాశ్ రోడ్డులో ఉన్న క్రీస్ట్ లూథర్ చర్చిలో జరిగిన ప్రార్థనల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె : మండలంలోని క్రైస్తవులు సోమవారం క్రిస్మస్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చౌడేపల్లె, లద్దిగం, కొత్తరోడ్డు, గడ్డంవారిపల్లె రోడ్డు, ఆమినిగుంట, వైఎస్ఆర్ కాలనీ, బత్తలాపురం రోడ్డు, పక్షిరాజపురంలోని చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిట్రెడ్డిపల్లెకు చెందిన వెంకటరమణ, శాంతమ్మ, దేవిప్రసాద్, బిందు ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు, దుప్పట్లు, స్వెట్టర్లు పంపిణీ చేశారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కళ్యాణ్, ఎంపీటీసీ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

వి.కోటలో..

వి.కోట: ప్రేమ, దయ, కరుణకు ప్రతీకగా క్రిస్మస్ నిలుస్తుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలగురునాథ్ తెలిపారు. వారు సోమవారం బీలివర్స్, బేతెల్, బాలయేసు, ఎస్టీ జెమ్స్ చర్చిల్లో క్రైస్తవులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అన్నదానం చేశారు. వైస్ ఎంపీపీ తమీమ్, వార్డు మెంబర్ ఖలీల్, గణపతి తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న రాష్ట్ర కార్యదర్శి పీఎస్.నాగరాజు











పెద్దపంజాణి: పేదలకు దుస్తులు అందజేస్తున్న ఎంపీపీ రెడ్డెప్ప, బైరెడ్డిపల్లె : సెయింట్ జోసెఫ్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు, కల్లూరు చర్చిలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ ధనరాజ్, క్రిస్ట్ లూథర్ చర్చిలో ప్రార్థనల్లో క్రైస్తవులు, చౌడేపల్లె : దుప్పట్లు అందజేస్తున్న వెంకటరమణ

జనం ముందు మీసాలు తిప్పితే భయపడతామా!

- ఆరోపణలను నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా
- నియోజకవర్గంలో రోడ్లు వేసింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే
- దమ్ముంటే చర్చకు రండి
- మాజీ మంత్రి అమర్‌నాథ్‌కు ఎమ్మెల్యే వెంకటేగౌడ సవాల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: జనాన్ని చూసి రెచ్చిపోయి మీసాలు తిప్పితే భయపడేవారు ఎవరూ లేరని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ పేర్కొన్నారు. మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి రెండు రోజుల క్రితం వి.కోట మండలం జవునిపల్లిలో ఈ రోడ్డును టీడీపీ ప్రభుత్వమే వేసిందని చెబుతూ మీసాలు తిప్పడంపై ఎమ్మెల్యే మండిపడ్డారు. ఆయన సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. టీడీపీ హయాంలో ఇక్కడి రోడ్లకు ఒక్క రూపాయి ఇచ్చినట్టు నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ చేశారు. జీవితమంతా జనాన్ని ఏమార్చుతూ, అవకాశవాద రాజకీయాలు చేయడం అమర్‌నాథ్‌రెడ్డి నైజమన్నారు. ఇకనైనా అలాంటి రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. నియోజకవర్గంలో అభివృద్ధిపై ఇప్పటికే చాలాసార్లు సవాళ్లు విసిరినా స్వీకరించలేదన్నారు. మంగళవారం సాయంత్రం ఆరు గంటల్లోపు డేట్, టైమ్, ప్లేస్ చెప్పాలని, తాను అక్కడికే వచ్చి రోడ్డు వేసిందెవరో జనం ముందు తేల్చుకుందామని సవాల్ విసిరారు. లేదా మీరు మాట్లాడిన రచ్చబండ వద్దకు రావడానికి అయినా తాను సిద్ధమేనన్నారు. వచ్చే ఎన్నికల్లో అమర్‌నాథ్‌రెడ్డి మరోసారి ఓడిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. సమావేశంలో పట్టణ కన్వీనర్ జాఫర్, నాయకులు మండీసుధా, మురళీకృష్ణ, కిరణ్, నాగరాజు, శ్యామ్, కోదండరామయ్య, హైదర్, నరేష్, హేమంత్, ముజ్జు, హయాత్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు

రామకుప్పం: మండలంలోని అన్ని సచివాలయ పరిధిలో మంగళవారం నుంచి జనవరి 9 వరకు ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో రాధాకృష్ణ తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 9.30 గంటలకు ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులోభాగంగా క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖో–ఖో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సచివాలయ పరిధిలో గెలుపొందిన జట్లు మండల స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటాయని పేర్కొన్నారు.

వి.కోటలో..

వి.కోట: మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో మంగళవారం నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మహ్మద్‌రఫీ తెలిపారు. స్థానిక బాలుర పాఠశాల ఆవరణలో నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడా పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు.

సదుంలో..

సదుం: మండలంలో మంగళవారం నుంచి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా సచివాలయాల పరిధిలో క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వరప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో కార్యక్రమాన్ని జెడ్పీటీసీ సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప ప్రారంభిస్తారని చెప్పారు.

నేడు అర్ధగిరి క్షేత్రంలో పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం పౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పైమాఘం సురేంద్రరెడ్డి, ఆలయ ఈఓ హనుమంతరావు తెలిపారు. ఉదయం స్వామికి అభిషేకం, అలంకరణ, పూజలు నిర్వహిస్తామన్నారు. 11 గంటలకు స్వామికి శాస్త్రోక్తంగా సుదర్శన హోమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తామని చెప్పారు. రాత్రి 8 గంటలకు ప్రాకారోత్సవం ఉంటుందన్నారు. భక్తుల కాలక్షేపం కోసం హరికథా గానం, భజనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

వాజ్‌పేయికి నివాళి

గుడుపల్లె: మండలంలోని చిన్నశెట్టిపల్లె సమీపంలోని బధిర పాఠశాలలో సోమవారం మాజీ ప్రధాని అటల్‌బిహారీ వాజ్‌పేయి జయంతిని బీజేపీ నేతలు ఘనంగా జరుపుకున్నారు. సద్గురు యోగినారాయణ బలిజ సేవా సంఘం అధ్యక్షుడు యం.ప్రభాకర్ ఆధ్వర్యంలో బధిర విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, సబ్బులు, మెటీరియల్ అందజేశారు. అన్నదానం చేశారు. వెంకటరమణ, సుబ్రమణ్యం, గోపీనాథ్, బీజేపీ మండల అధ్యక్షుడు శివకుమార్, మంజునాథ్, పాఠశాల కరస్పాండెంట్ గోవిందరాజులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ధార్మిక చైతన్యం కలిగి ఉండాలి

కుప్పం రూరల్ : ప్రతి ఒక్కరూ ధార్మిక చైతన్యం కలిగి ఉండాలని బంగారుపాళ్యం బ్రహ్మానంద ఆశ్రమం స్వామీజీ కేశవానంద తెలిపారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం కుప్పం పట్టణంలోని శివాలయంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషీ ధార్మిక చైతన్యం కలిగి ఉండడం ద్వారా సమాజంలో శాంతి నెలకొంటుందని చెప్పారు. అయోధ్యలో రామాలయం ప్రారంభోత్సవాన్ని హిందువులు సమ్మిళితమై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు పట్టణంలో హిందూ సమ్మేళనం ప్రాధాన్యతను వివరిస్తూ ర్యాలీ చేశారు.



ర్యాలీ చేస్తున్న సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

శాస్త్రోక్తంగా హనుమాన్ చాలీసా



హనుమాన్ చాలీసా యజ్ఞ భజనలు చేస్తున్న నిర్వాహకులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఆస్థాన మండపంలో శాస్త్రోక్తంగా హనుమాన్ చాలీసా యజ్ఞ భజన కార్యక్రమాలను రామాంజనేయ నామ సంకీర్తన మండలి సభ్యులు నిర్వహించారు. చెన్నైకు చెందిన సంకీర్తన మండలి సభ్యులు సోమవారం ఉదయ్‌కుమార్ బృందం 108 హనుమాన్ చాలీసా సంకీర్తనలు నిర్వహించడానికి విచ్చేశారు. వారికి ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ఆస్థాన మండపంలో సంకీర్తనలు ప్రారంభించారు. సంకీర్తన మండలి బృందం శాస్త్రోక్తంగా భక్తులకు వినుపుగా వినిపించారు. అనంతరం వారికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో కాణిపాకం సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, రామాయణ హరినాథ్ రెడ్డి, నిర్వాహకులు భాస్కర్ నాయుడు, జగదీష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేపు గంగమ్మ ఆలయంలో బహిరంగ వేలం

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఈ నెల 27వ తేదీ బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఆలయ చైర్మన్, ధర్మకర్తల మండలి సభ్యులు, దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో మమత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి భక్తులు సమర్పించే చీరలు, రవికెల సేకరణ లీజు హక్కు, అమ్మవారి ఫొటోలు, కీచైన్లు వగైరాలు విక్రయానికి కౌలు హక్కు కల్పించనున్న సందర్భంగా ఈ బహిరంగ వేలం పాట చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ లీజు హక్కు డిసెంబర్ 27 నుంచి 2024 డిసెంబర్ 26వ తేదీ వరకు ఏడాదిపాటు ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు దేవస్థానం కార్యాలయం పని వేళల్లో సంప్రదించి వివరాలు పొందవచ్చని తెలిపారు.

బంగారు తిరుచ్చిపై శ్రీకృష్ణుడి అభయం



చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలో బంగారు తిరుచ్చిపై రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం శ్రీకృష్ణ స్వామివారి జన్మనక్షత్రమైన రోహిణి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయం అభిషేక సేవను చేపట్టి, స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ కాంతుల నడుమ స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ చేపట్టారు. సర్వాలంకార శోభితులైన స్వామి, అమ్మవార్లు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడ వీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. రుక్మిణి సత్యభామ సమేత తిరుచ్చిపై కొలువైన దేవేరులను దర్శించుకున్న భక్తులు, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, ఆర్జితం ఇన్స్‌పెక్టర్ ధనశేఖర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం సీజ్

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న భాగ్యరాజ్ (25) అనే నిందితుడిని చిత్తూరు టూటౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పోలీసులు సంతపేట వద్ద తనిఖీలు చేస్తుండగా భాగ్యరాజ్ అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. అతన్ని తనిఖీ చేయగా 120 కర్ణాటక మద్యం ప్యాకెట్లు లభించాయి. అతన్ని అరెస్టు చేసినట్లు సీఐ ఉలసయ్య తెలిపారు.

కొండమల్లీశునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండ మల్లీశునికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు.

పూరి గుడిసె దగ్ధం



వెదురుకుప్పం: మండలంలోని వైఎస్సార్ ఎస్టీ కాలనీలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో కళావతికి చెందిన పూరి గుడిసె దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించిందని బాధితులు తెలిపారు. పూరిల్లు పూర్తిగా కాలిపోవడంతో ఇంట్లో ఉన్న వస్తువులు కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.లక్ష మేర ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. ప్రమాద ఘటన తెలుసుకున్న పచ్చికాపల్లం శ్రీలక్ష్మి ఎలక్ట్రానిక్స్ యజమాని ప్రసాద్ బాధిత కుటుంబానికి రూ.5 వేలు నగదు, వంట సరుకులు వితరణ చేశారు. దేవళంపేట సోక్రటీస్ ఇంగ్లిషు మీడియం యాజమాన్యం బాధిత కుటుంబానికి అండగా నిలిచి దుస్తులు, దుప్పట్లు వంట పాత్రలు అందజేశారు.